ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

**Friday, January 21st, 2011**

# ధర్నాలకు బెదరను

## ● పాలకపక్షానికి గవర్నరు హెచ్చరికలు ● కేసులపై రెండు రోజుల్లో తేల్చేస్తా



జైన్ కళాశాలలో విద్యార్థినికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న గవర్నరు

బెంగళూరు, జనవరి 20 (న్యూస్‌టుడే): భూ కుంభకోణాల ఆరోపణలపై ముఖ్యమంత్రి యడ్యూరప్పకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసు నమోదుకు జస్టిస్ ఫర్ లాయర్స్ ఫోరం న్యాయవాదులకు అనుమతి ఇవ్వాలో వద్దో రెండు రోజుల్లో తేల్చేస్తానని గవర్నర్ భరద్వాజ ప్రకటించారు. గురువారం నగరంలోని జైన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడారు. తనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా బంద్, ధర్నాలు ఇతర ఏ ఆందోళనల్ని భాజపా చేసినా పట్టించుకోబోనని చెప్పారు. 'ఇవన్నీ నేటి రాజకీయ విన్యాసాలు. వీటికి భయపడే ప్రసక్తేలేదు' అన్నారు. 'రాజకీయాల్లో వాళ్లింకా విద్యార్థులు, నేను ఆచార్యుణ్ని' అని అభివర్ణించారు. దొంగే పోలీసును దొంగ.. దొంగ అన్న చందంగా భాజపా వ్యవహారం మారుతోందని మండిపడ్డారు. తను కేవలం కర్తవ్యాన్ని మాత్రమే నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. 'న్యాయవాదులు యడ్యూరప్పపై కేసు నమోదుకు లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. దాన్ని పరిశీలించటం తప్పనిసరి' అన్నారు.